బెత్తం బెరుకు పుట్టిస్తుంది. పిల్లల సృజనశక్తుల్ని నియంత్రిస్తుంది. చదువుపై మమకారాన్ని చంపేస్తుంది. బడి అంటే భూతం లాంటిదనిపిస్తుంది. భయపెట్టి చదువు నేర్పే ధోరణి అంతిమంగా వాళ్ళను విద్యకు దూరం చేస్తుంది. కాని పిల్లలపై ప్రేమతో, మమకారంతో లాలించి దగ్గరికి తీస్తే వాళ్ళలో చదువుకోవాలన్న తపన, ఆరాటం పెరుగుతుందని తెలియజెప్పే కథ ఇది.

# నేనూ చదవగలను!

"మా వాడికి పొట్టకోస్తే అక్షరమ్ముక్క రాదు సార్! మీరే ఎలాగైనా వాడికి చదువు వచ్చేలా చెప్పాలి.

వాన్నెంత తన్నినా నేను మిమ్మల్ని ఏం అడగను. వాడికి చదువు రావడం ముఖ్యం."

ట్యూషన్ సార్‌తో ఆమె చెపుతోంది. సురేష్ భయం భయంగా వింటున్నాడు.

ట్యూషన్‌లోని పిల్లలంతా సురేష్ వైపు వింత జంతువును చూసినట్లు చూస్తున్నారు.

ఆ కొత్త వాతావరణంలో వారి చూపులు సురేష్‌ను గుచ్చుకుంటున్నాయి. వాడికి ఒకవిధమైన బెరుకును కలిగిస్తోంది.

"మీరెళ్ళండమ్మ వీడికి చదువు ఎలా రాదో నేను చూస్తాగా?!" అతడి మాటలు ఆమెకి అభయం కలిగిస్తే సురేష్‌కు భయం కలిగించింది.

"నేనొస్తాన్సార్."

"మంచిది. వెళ్ళండమ్మ!"

తల్లి వెళుతుంటే అటే చూస్తూ నిలబడ్డాడు సురేష్.

"ఒరేయ్! ఇలా వచ్చి కూర్చో. రేయ్ చంద్ర! నీవు కాస్త పక్కకు జరిగి వాడికి కూర్చోడానికి చోటివ్వు."

ఆ చంద్ర అనే పిల్లవాడు పక్కకు జరిగాడు. సురేష్ ఆ స్థలంలో ఇరుక్కొని కూర్చున్నాడు.

"ఆ... మీ స్కూల్లో ఏ పాఠం చెపుతున్నారు... లే, లేచి నిలబడు ముందు."

సురేష్ పుస్తకం పట్టుకొని లేచాడు.


"ఊ... ఏ పాఠం చెపుతున్నారు. అది చదవగలవా?" అతడి స్వరంలో ఒక సందేహం.

అతడు సమాధానం చెప్పేలోపు ఆ గుంపులో నుంచి ఒక స్వరం వినిపించింది.

"సార్ వాడికి చదవటం రాదుసార్" అని.

ఆ మాట విన్పించినవైపు చూశాడు సురేష్. పవిత్రన్...

వాడిని చూడగానే సురేష్‌లో ఎక్కడలేని నీరసం ముంచుకువచ్చింది. వాడు చేసిన అవమానాలన్నీ ఒక్కొక్కటిగా గుర్తుకువచ్చాయి.





రాంచందర్

** ** **

పవిత్రన్, సురేష్ ఇద్దరూ ఒకే స్కూలు. ఫిఫ్త్ క్లాస్ చదువుతున్నారు. స్కూల్లో సురేష్‌కు చదువురాని మొద్దుగా ముద్రపడిపోయి వుంది.

దాంతో పవిత్రన్ సురేష్‌ను అవకాశం దొరికినప్పుడల్లా ఏడ్పిస్తుంటాడు.

దార్లో వెళుతున్నప్పుడు వచ్చే లైబ్రరీ గోడ మీద రాసి వున్న రాతలను చూపించి చదవమనేవాడు.

పోస్టర్లపైన సినిమా పేర్లను చదవమనేవాడు. లేకపోతే రోడ్డుమీద దొరికే కాగితాలను చేతికిచ్చి ఆ అక్షరాలు ఏవో గుర్తించమనేవాడు. అవన్నీ చదవలేక ముడుచుకుపోవడం చూసి "చదువురాని మొద్దు, చదువురాని మొద్దు" అని ఏడిపించేవాడు.

పవిత్రన్ దగ్గర లెక్కల పుస్తకం లేదు. దాని కోసం వాడు సురేష్ ఇంటికి వచ్చేవాడు. అలా వచ్చినప్పుడు పుస్తకం తీస్కొని వెళ్ళేవాడు కాదు. సురేష్ వాళ్ళమ్మ దగ్గరికి వెళ్ళి-

"ఆంటీ! మ్యాథ్స్ హోంవర్క్ ఇచ్చారు. సురేష్ చేశాడాంటీ" అని అడిగేవాడు. అవి చేసుండడని తెలిసే.

ఆమెకు అదేం తెలీకపోవడంతో సురేష్‌ను అడిగేది "ఏరా చేశావా?" అని. వాడు 'లేద'నేవాడు. 'ఎందుకు చేయలే'దని ఆమె వాడిని చితకబాదేసేది. హోంవర్క్ ఇచ్చిన విషయం చెప్పకపోవడమేకాకుండా, చేయకపోవడం కూడా ఆమె కోపానికి కారణమయ్యేది.

ఆ విధంగా వాడిని తన్నటం చూశాక పవిత్రన్ హాయిగా నవ్వుకుంటూ వెళ్ళేవాడు.

అలాంటి పవిత్రన్ అక్కడ ప్రత్యక్షం అయినట్లు కన్పించడంతో సురేష్‌కు భయం కూడా కలిగింది.

"ఏరా నిజమేనా? నీకు చదవటం రాదా?" సార్ కంఠం ఖంగుమంది. ఆ స్వర తీవ్రతకు వాడు నిశ్చలంగా నిలబడిపోయాడు.

"ఏం రాదా?" మరోసారి సార్ నోటి నుంచి వచ్చిన అరుపు సురేష్ గుండెలో ప్రతిధ్వనించింది.

"నిజంగానే సార్! స్కూల్లో కూడా ఇంతే. చదవమంటే ఇలాగే లేచి నిలబడతాడు. అప్పుడేమో మా మేడం వీడిని బాగా తన్ని కూచోబెడుతుంది"

సార్ తర్వాత చేయాల్సిన పనిని చెప్పకనే చెప్పాడు పవిత్రన్.

సురేష్ అభావంగా నిలబడి వున్నాడు. వాడి చూపు సార్ చేతిలో కదులుతున్న బెత్తంపైనే వుంది. అది ఎప్పుడు తన శరీరంపై నాట్యమాడుతుందో అనే భయం, తెరచి పట్టుకున్న పుస్తకంలోని అక్షరాలను కన్పించనీయడం లేదు.

"ఇలారా" అని పిల్చాడు. సురేష్ కదల్లేదు. కనురెప్పయినా కొట్టకుండా సార్‌నే చూస్తూ నిలబడ్డాడు.

"రేయ్ ముందు ఇలా రమ్మన్నానా?" అని పిలిచాడు. అలా పిలవడంతో 'ఇక నీవు మాటలతో చెపితే వినేలా లేవు. తన్నులు తప్పవు" అనే హెచ్చరిక విన్పించింది.

అయినా వాడు కదల్లేదు. దాంతో అతడికి ఇంకాస్త కోపం పెరిగింది. "రేయ్ వాడిని ఇలా పంపండ్రా" అన్నాడు. సురేష్ పక్కనున్న పిల్లలు సురేష్‌ను సార్ వైపు నెట్టారు.

ఇప్పుడు అతడు ఆయన బెత్తానికి అందుబాటులో దెబ్బ కాటు దూరంలో ఉన్నాడు.

"ఊ... ఏది అదేనా పాఠం. తీసి చదువు. చదవకపోయావో నీ తోలు వలిచేస్తా" అని గర్జించాడు.

సురేష్ భయంతో వణికిపోయాడు. వాడి దృష్టి పూర్తిగా బెత్తంపైనే కేంద్రీకృతమైంది.

వాడలా కదలిక లేకుండా నిలబడి పోవడంతో అతడి కోపం తారాస్థాయినందు కుంది.

మొదటి దెబ్బ వాడి చేతిపై పడి 'టప్'మనే శబ్దం వచ్చింది. చేతిలో పుస్తకం కింద పడిపోయింది.

వాడికి దెబ్బ తాలూకునొప్పి తెలుస్తుండగా మరో

దెబ్బ... దెబ్బపైన దెబ్బ... "అందుకేరా మీ అమ్మ నిన్ను ఎంతైనా కొట్టమంది" అని కోపం తగ్గేవరకు తన్ని కూర్చోబెట్టాడు. అక్కడ వాడి రోదన జనారణ్య రోదనే అయింది.

వాడు వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తుంటే పిల్లలంతా చోద్యం చూస్తున్నట్లు చూసి నవ్వుకున్నారు.

కొన్నాళ్ళవరకూ ఆ ట్యూషన్‌లోనే వున్నాడు. అక్కడ కూడా వాడికి చదువు రాలేదని తెలిసిపోయాక మాన్పించేసింది. తిరిగి తనే ఇంటి దగ్గర చదువు చెప్పడం మొదలుపెట్టింది. అయితే ఆమెచెప్పే చదువులో చెప్పడంకన్నా తన్నడమే ఎక్కువ.

ఒకరోజు అలాగే తంతూ చదువు చెపుతూ వుంది. వాడు గుక్కపట్టి ఏడుస్తున్నాడు.

అలాంటి సమయంలో వాడి అమ్మమ్మ వచ్చింది. వాడిని తన్నటం చూసి ఆమె కోపగించుకుంది.

"వాడికా చదువు రాకపోతే పోనీ. పిల్లాడిని అంతలా గొడ్డును బాదినట్లు బాదాలా? పిల్లగాడు చూడు చచ్చేలా వున్నాడు, ముందు దాన్ని వదులు" అని ఆమె నుంచి దూరంగా తీసుకొనిపోయింది. ఆమెకు చదువురాదు. చదువు విలువ తెలీదు.

అయితే తన్ని చెప్పటం వల్ల కూడా చదువురాదు అంటుంది.

"నీవలాగే అంటావ్. కనీసం వాడికి తెలుగు కూడా చదవడం రాదు. ఇలాగే వదిలేస్తే పెద్ద అయిన తర్వాత గాడిదలు కాయాల్సిందే" అంది కోపంగా తల్లితో.

"ఏం అవసరం లేదులే! నేను ఓ టీచరమ్మను చూశాను. ఆమె బాగా చెప్తుందంట. వీడిని అక్కడికి తీసుకొని పోవడానికే ఇప్పుడు వచ్చింది నేను" అంది.

"తీస్కెళ్ళు తీస్కెళ్ళు. అక్కడెంత మాత్రం చదువు వస్తుందో చూద్దాం" కోపంగా అంది.

"సరేలే వాడికొచ్చినంత వస్తుంది" అని "లెయ్‌రా!" అని వాడిని తనవెంట తీసుకొని వెళ్ళింది.

**  **  **

వాడు భయం భయంగానే ఆ ట్యూషన్‌లో ప్రవేశించాడు. అయితే అక్కడ మిగతా ట్యూషన్లకు భిన్నంగా ప్రశాంతంగా వుంది. పిల్లలు కూడా ఎక్కువమంది లేరు. అంతా పదిమంది లోపు వున్నారు. వాళ్ళు కూడా ఒకసారి సురేష్ వైపు చూసి తిరిగి తమ పుస్తకాల్లోకి తలలు దూర్చేశారు.

ఆ ట్యూషన్ చెప్పే టీచరమ్మతో ఆమె చెప్పింది. "మా వాడికి బాగా చదువు వచ్చేలా చెప్పండమ్మ" అని.

అమ్మమ్మ టీచరమ్మతో అలా చెప్పటం నచ్చింది. అదే వాళ్ళమ్మ అయితే అలా చెప్పదు. "మా వాడికి ఏం రాదు. తన్నైనా చదువు వచ్చేలా చెప్పండి" అని చెపుతుంది.

వాళ్ళంతా చదవమని తన్నేవాళ్ళు. తన్నేకొద్ది వాడు బిగుసుకుపోయేవాడు.

అలాంటిది అమ్మమ్మ తన్నమని చెప్పకుండా చదువు చెప్పమని చెప్పడం వాడికి ఆనందం కలిగించింది.

"ఇలారా బాబూ!" అని పిల్చింది సురేష్‌ను.

వాడు సంకోచంగా లేచి నిలబడ్డాడు.

ఆ రూం అంతా ప్రశాంతంగా వుంది. ఆమె మొహంలో చిరునవ్వు వెలుగుతోంది. కుర్చీలో రిలాక్స్‌గా కూర్చొని వుంది. అంతేకాకుండా ఆమె చేతిలో బెత్తంలేదు. వాడికి కాస్త ధైర్యం వచ్చింది.

ఆ వాతావరణం నచ్చింది. బెరుకు కాస్త తగ్గింది. అందులోనూ ఆ ట్యూషన్లో తన స్కూలు విద్యార్థులు ఎవరూ లేరు. ముఖ్యంగా పవిత్రన్‌గాడు లేడు. కాబట్టి తనని ఇక్కడ ఎవరూ చదువురాని మొద్దు అనరు. తనకు చదువురాదనే విషయం ఇక్కడ ఎవరికీ తెలీదు.

"ఇలారా! నీ పేరేంటి అన్నావ్" అని అడిగింది- చిరునవ్వు చెదరకుండా.

వాడు ధైర్యంగా ఆమె దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు. చేతులు కట్టుకొని తన పేరు చెప్పాడు.

"మీ స్కూల్లో ఇప్పుడు ఏయే పాఠాలు చెపుతున్నారో చెప్పు. అవి మళ్ళా ఒకసారి నేను చెపుతాను. నీకు ఇంకా బాగా అర్థమవుతుంది.

ఏదీ ఆ తెలుగు పుస్తకంలోని ఒక పాఠం ఏదైనా చదువు" అంది.

సురేష్ తెలుగు పుస్తకం తీసుకొని మొదటి పాఠాన్ని తీసి చదవటం మొదలుపెట్టాడు. పాఠం మొత్తం చదివేసరికి పావుగంటపట్టింది.

వాడికి మొదట అర్థంకాలేదు. తెరిచిన పుస్తకంలోని అక్షరాలు ముత్యాల్లా కన్పించాయి. ఇంతకు మునుపు ఎప్పుడూ అవి అలా కన్పించలేదు. అలాంటిది పాఠం మొత్తం తప్పుల్లేకుండా, తడబడకుండా చదివింది తనేనా? వాడికి ఆనందం హృదయంలో కదలి కెరటంలా ఉవ్వెత్తున ఎగిసిపడుతోంది.

మంచుపర్వతంపై స్కేటింగ్ చేస్తున్నట్లుంది. పిల్లపక్షి మొదటిసారి గాల్లోకి హాయిగా ఎగిరినట్లుంది. నీటిలో చేపలా ఈదినట్లుంది. కొండ ఎక్కి మేఘాలను పాపిడి మిఠాయిలా తిన్నట్లుంది. చుక్కలను తెంపి జేబులో బొరింగుల్లా పోసుకొని తిన్నట్లుంది.

'నేను చదవగలను. నేను కూడా మిగతా పిల్లల్లాపాఠాలు చదవగలను. నేను మొద్దును కాను' అని అనుకున్నాడు. వాడికి ఆనందంతో గంతులు వేయాలనుంది. అంత పాఠం చదివింది తనేనా అంటే నమ్మశక్యం కావడం లేదు. కానీ నిజం అదే

'ఇక ఇప్పుడు అమ్మతో తన్నులు తినాల్సిన పనుండదు. పవిత్రన్‌గాడు ఏదైనా చదవమని చెప్పినప్పుడు గడగడ చదివి వాడిని ఆశ్చర్యంలో ముంచాలి'

'అవును తనెలా చదవగలిగాడు? మిగతా ట్యూషన్లలో చదవడం వచ్చా అని అడిగేవాళ్ళు. అంతవరకూ చదవని నేను వస్తుంది అని ఎలా చెప్పగలను. రాదు అనేది తన సమాధానమయ్యేసరికి తన్నేవాళ్ళు. అసలు తంతారనే కదా తను చదవకుండా వుండేది. వాళ్ళు చదవమని చెప్పి బెత్తం ఊపుతూ ఎదురు నిలబడితే భయం వచ్చేది. చదువు మాత్రం వచ్చేది కాదు.

అందుకే ఇంటికి వెళ్ళిన తర్వాత అమ్మతో చెప్పాలి. ఇంకోసారి నాకు చదువు చెప్పేటప్పుడు బెత్తం దూరం పెట్టమని. ఊ.... అసలు బెత్తమే వుండకూడదని చెప్పాలి. అది లేకపోతే నాకు పాఠం చదవడం వస్తుందని చెప్పాలి. సార్లకు, అమ్మలకు అందరికీ చెప్పాలి. బెత్తాలు లేకుండా పాఠాలు చెపితే మేమంతా, అంటే పిల్లలమంతా పాఠాలుచదువుతామని చెప్పాలి' అని అనుకున్నాడు.

వాడికి ఎప్పుడెప్పుడు ఇంటికి వెళ్ళి తల్లితోతను చదవగలడనే విషయాన్ని చెప్పాలనే ఆత్రుత పెరుగుతోంది. నమ్మకపోతే వెంటనే పుస్తకం తీసి గడగడ చదివి వినిపించాలి.

"ఏం సురేష్! చదవడం అయిపోయిందా" అని మేడం మాట విని చప్పున తన ఊహాలోకం నుంచి బైటికి వచ్చాడు. తన ఆలోచనలకు సిగ్గుపడ్డాడు.

"సరే, ఈరోజుకు ఇంటికి వెళ్ళి ఏపురా. రేపట్నించి పాఠాలుమొదలు పెడతాను" అనగానే పుస్తకాల సంచి మెడకేసుకొని ఆకాశంలో తేలిపోతున్నట్లు పరుగందుకున్నాడు.

వాడికి ఈ ప్రపంచానికంతా విన్పించేట్టు "నేను చదవగలను" అని గట్టిగా అరిచాడు. రోడ్డు మీద ఒకరిద్దరు వాడివైపు చూసే లోపు తుర్రుమని పరిగెత్తాడు. ◉

# సాధనతో సాధ్యంకానిదిలేదు

స్వగతం



రాచమడుగు శ్రీనివాసులు

నేను హైస్కూలులో చదువుకునే రోజుల్లో ఇంగ్లీషు అంటే చాలా భయంగా వుండేది. ఎప్పుడూ పాస్ మార్కులు కూడా వచ్చేవికావు. టీచరు బోర్డుమీద రాసినవి చూసి కూడా తప్పులు లేకుండా రాయలేకపోయేవాడిని. ఒకరోజు బాగా కష్టపడి అయినా సరే ఇంగ్లీషు నేర్చుకోవాలని గట్టిగా నిర్ణయించుకున్నాను. ఎన్నిపనులున్నా సరే ప్రతి రోజు క్రమం తప్పకుండా ఒక అరగంట ఇంగ్లీషు చదవడం, రాయడం చేసేవాడిని. 15 నిమిషాలైనా డిక్షనరీలో పదాలను చూడడం అలవాటు చేసుకోవడమేకాక ఏరోజుకారోజు కొన్ని కొత్త పదాలను వాటి అర్థాలతో సహా ఒక డైరీలో రాసుకుని వాటిని ఉపయోగిస్తూ మిత్రులకు ఉత్తరాలు రాసేవాడిని. క్రమంగా ఇంగ్లీషు నేర్చుకోవడంలో ఉత్సాహం పెరిగింది. బి.ఎలో ఇంగ్లీషు లిటరేచరును తీసుకున్నాను. తెలిసిన బంధుమిత్రులంతా ఇంగ్లీషు లిటరేచర్‌లో పాస్‌కావడం చాలా కష్టం, వేరే సబ్జెక్టు తీసుకోమని సలహా ఇచ్చారు. కానీ నేనేమీ అధైర్యపడకుండా ఇంగ్లీషు లిటరేచరే తీసుకున్నాను. ఉత్సాహంతో ఆంగ్ల భాషను, సాహిత్యాన్నీ చదవడం ప్రారంభించాను.

కాలేజీలో ఇంగ్లీష్ లెక్చరర్స్‌ను చూసి "నేనుకూడా ఇంగ్లీషు లెర్చరర్‌నే కావాలి, వేరే ఉద్యోగమేదీ నాకువద్దు" అని దృఢంగా నిశ్చయించుకున్నాను. మూడు సంవత్సరాలు శ్రద్ధతో ఆంగ్ల సాహిత్యాన్ని చదివి మా క్లాసులో సెకండ్ ర్యాంకు సాధించాను. ఆ తర్వాత అనంతపురంలోని ఎస్.వి.యు.పి.జి. సెంటర్‌లో (ఇప్పుడు శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ) ఎం.ఎ.లో ఇంగ్లీషు తీసుకుని ఎం.ఎ. డిగ్రీ పొందాను. నేను అనుకున్నట్లే ఇంగ్లీషు లెక్చరర్ అయి ఇప్పుడు ఎమ్మిగనూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్లోపన్యాసకునిగా ఉన్నాను. గత 20 సంవత్సరాలుగా కొన్నివేల మంది విద్యార్థులకు ఇంగ్లీషు బోధించాను. నేను నేర్చుకున్న ఇంగ్లీషు వల్ల ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆంగ్ల రచయితలు షేక్స్‌పియర్, మిల్టన్, వర్డ్సువర్త్, కీట్స్‌లాంటి వారి రచనలను చదవగలిగాను. వివేకానందస్వామి, జిడ్డు కృష్ణమూర్తి, ఆచార్య రజనీష్, డాక్టర్ రాధాకృష్ణన్ మొదలైనవారు ఆంగ్లభాషలో చేసిన ఉపన్యాసాల్లోని మాధుర్యాన్ని తనివితీరా ఆస్వాదించగలిగాను. తీరిక సమయాల్లో నేను ఇంగ్లీషులో రాసిన ఉత్తరాలు, కవితలు కొన్ని మాగ్‌జైన్‌లలో ప్రచురింపబడ్డాయి. ఆంగ్లభాషపై నా కృషిని నేను ఇంకా కొనసాగిస్తూనే ఉన్నాను. విద్యార్థులకు, ఇంగ్లీషు నేర్చుకోవాలనుకొనే అభిలాష ఉన్న ప్రతి ఒక్కరికీ నా సలహా "సాధనమున పనులు సమకూరు ధరలోన" - ఇది సత్యం.